క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



భామిని: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వసంత కుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆమెకు డిప్యూటీ ఎంపీడీఓ అమరాన జగన్నాథం, టైపిస్ట్ గోపాలకృష్ణ స్వాగతం పలికి అభినందించారు.

శాకంబరిగా కోటదుర్గ..



శాకంబరిగా భక్తులకు దర్శనమిస్తున్న కోటదుర్గమ్మ

పాలకొండ రూరల్: శాకంబరీ దేవి భక్త వరదాయిని అని అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ అన్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం పాలకొండ కోటదుర్గమ్మ బుధవారం కూడా శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం అర్చక బృందం భక్తులు సమర్పించిన వివిధ రకాల కూరగాయలను అమ్మవారికి అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎంపీ దృష్టికి సమస్యలు..



ఎంపీ తనూజారాణికి సమస్యలు వివరిస్తున్న మండల ప్రజా ప్రతినిధులు

పాలకొండ రూరల్: అరకు ఎంపీ జి.తనూజారాణి దృష్టికి పంచాయతీల్లో పేరుకుపోతున్న సమస్యలను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లారు. బుధవారం పాలకొండ వచ్చిన ఆమెను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనపాక సూర్యప్రకాష్, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా పంచాయతీలకు ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. దీంతో మౌలిక సమస్యలు తలెత్తుతున్నట్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు నిధులు లేవన్నారు. ఈ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిర్లంగి ఉపేంద్ర కుమార్, కె.లీలాప్రసాద్ పాల్గొన్నారు.

సన్మానం..

పాలకొండ: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన కె. శ్రీనివాసులను సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు అందించిన సేవలను కొనియాడారు.

రేషన్‌కు వస్తే రోజంతా పస్తులే..



మాజీ ఎమ్మెల్యే కళావతి వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న లబ్ధిదారులు

సీతంపేట: రేషన్‌కు వస్తే రోజంతా పస్తులుండాల్సిన పరిస్థితి ఉందని పలు గ్రామాల గిరిజనులు మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి దృష్టికి తీసుకువచ్చారు. మాజీ ఎమ్మెల్యే లోకొత్తవలస వైపు బుధవారం వెళ్తుండగా.. మార్గమధ్యలో రేషన్ లబ్ధిదారులు ఆమె వాహనాన్ని ఆపి తమ గోడు వెల్లబోసుకున్నారు. గజిలి, ఈతమానుగూడ గ్రామాల నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న లోకొత్తవలస గ్రామానికి వచ్చామని చెప్పారు. ఉదయం 9 గంటలకు వస్తే సాయంత్రం 5 గంటలకు సరుకులు ఇచ్చారని.. సిగ్నల్స్ అందక గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని తెలిపారు. ఈ రోజంతా భోజనం లేక ఉన్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో ఇంటివద్దకే ఎండీయూ వాహనం వచ్చి బియ్యం ఇచ్చేవారని.. ఇప్పుడా పరిస్థితి లేదని వాపోయారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ కె. విష్ణుమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గాసీవీధి, కస్పావీధి, పెదకాపు, చినకాపు వీధులు, సమీప ప్రాంతాలతో పాటు గారమ్మకాలనీ, లుంబూరు వారి వీధి, నెయ్యిల వీధి, వీరఘట్టం రోడ్డు నుంచి మండలంలో తుమరాడ వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇసుక మేటలతో ఇక్కట్లు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదార్లలో కురిసిన వర్షాలకు ఇసుక మేటలు వేశాయి. ఈ ఇసుక మేటల పైనుంచి వాహనాలు జారుతుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు.

చంద్రబాబు పెద్ద మాయల మరాఠీ..

- ప్రజలను మోసగించడంలో సిద్ధహస్తుడు
- ప్రజల పక్షాన పోరాటం చేయాల్సిన సమయం ఇదే..
- కూటమి మోసం ప్రజలకు వివరించాలి
- ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం
- నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో నాయకులు



పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరైన పార్టీ కార్యకర్తలు, నాయకులు



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న పరీక్షిత్ రాజు

పాలకొండ: చంద్రబాబునాయుడు పెద్ద మాయల మరాఠీ అని.. ప్రజలను మోసగించడంలో సిద్ధహస్తుడని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగించడం.. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా చేశానని చెప్పుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ప్రస్తుతం మనం ప్రజల పక్షాన పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని... కూటమి మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కూటమి నాయకుల అక్రమాలకు బలవుతున్న కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బుధవారం స్థానిక ఏఎంజీ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశనిర్దేశం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజ్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీలు అమలు చేయకుండా.. చేశామని ఇంటింటికీ వెళ్లి చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమయంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల పరిస్థితిని ప్రజలకు వివరించాల్సిన అవసరం మనపై ఉందని చెప్పారు.

సీనియర్ నాయకుడు, దివంగత నేత పాలవలస రాజశేఖరంనకు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.అలాగే అరుకు ఎంపీ పుట్టినరోజు వేడుకలు కూడా ఘనంగా నిర్వహించారు.

ఏడాదికే చతికిలపడ్డారు..



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే చతికిలపడిందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు అందించిన ఉచిత విద్యుత్ లేకుండా చేశారని మండిపడ్డారు. నియోజకవర్గంలో అభివృద్ధి జాడే లేకుండా పోయిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనకు, కూటమి పాలనకు మధ్య తేడాను ప్రజలకు వివరించాలని సూచించారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు..



వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని అరుకు ఎంపీ గుమ్మ తనూజరాణి అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై పోరాటం కొనసాగించాలని సూచించారు. వైఎస్ జగన్ మోహనరెడ్డికి ఉన్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే కూటమి నాయకులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఇక నుంచి మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి పార్టీ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై గ్రామాల్లో ఉన్న పరిస్థితిని వివరించారు. నాలుగు మండలాల నుంచి పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ఎదుర్కోవాలి..



కూటమి అరాచకాలను ఐకమత్యంతో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ప్రశ్నించిన వారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కేసులు పెడుతున్నారని.. ఇలా ఎంతమందిపై కేసులు పెడతారని ప్రశ్నించారు. ప్రతి సమస్యపై గ్రామ స్థాయిలో నాయకులంతా కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇటీవల కాలంలో కలసి పోరాటం చేయడం ద్వారా అనేక విషయాల్లో కూటమి ఎత్తులను విజవంతంగా ఎదుర్కొన్నామని వివరించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



కొత్తపల్లిలో పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

గరుగుబిల్లి: ప్రస్తుతం అడపదడపా వర్షాలు కురవడంతో గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్యం పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా గ్రీన్ అంబాసిడర్‌లకు ప్రతీ రోజు ఇంటిలోని చెత్తను అందజేయాలన్నారు. ఇంటిముందు మురుగునిల్వలు లేకుండా చూడాలన్నారు. పంచాయితీ కార్యదర్శి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పంచాయతీలు ఆర్థిక పుష్టిని సాధించాలి

పంచాయతీలు ఆర్థిక పుష్టిని సాధించేందుకు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) సెంటర్‌ను ఆయన పరిశీలించి తయారైన వర్మీ కంపోస్టును విక్రయించేలా సిబ్బందికి ఆదేశించారు. ఆయనతో పాటు కార్యదర్శి తదితరులు న్నారు.

అన్నదాత పట్ల నిర్లక్ష్యం..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: టీడీపీ కూటమి ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు, బాలేరు ఎంపీటీసీ సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్, పాలక ఉషారాణి ఆరోపించారు. ఈమేరకు బాలేరులో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ..రైతుసేవా కేంద్రాల ద్వారా కనీసం ఎరువులు కూడా ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు. గతంలో రైతుభరోసా కేంద్రాలు నిత్యం రైతు అవసరాలు తీర్చేవన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎరువులన్నీ ప్రైవేట్ డీలర్లకు అందించి చేతులు దులుపుకుందని.. దీంతో రైతులు ఎరువులు, విత్తనాలందక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంతవరకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదని మండిపడ్డారు. వారి వెంట పార్టీ నాయకుడు మేడిబోయిన చలపతి ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0' అంశంపై బుధవారం శిక్షణ సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా పంచాయతీకి రావాల్సిన నిధులు, ఏయే అభివృద్ధి పనులకు ఎంత ఖర్చు చేయాలో చర్చించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.గౌరినాయుడు, ఏఓ జె.సౌజన్య, ఏపీఓ జి.సత్యంనాయుడు, హౌసింగ్ ఏఈ పి.వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా ఎరువుల విక్రయాలు



సింగిడిలో ఎరువుల డిపో తనిఖీ చేస్తున్న ఏఓ కొల్లి తిలక్

భామిని: మండలంలోని సింగిడిలో గల ఎరువుల డిపోను మండల వ్యవసాయాధికారి కొల్లి తిలక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మకాలు సక్రమంగా చేపట్టాలన్నారు. కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు రశీదులు తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి రైతు నుంచీ బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు తేజా, ఈశ్వర్ ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



పింఛన్ల వివరాలను ఎంపీడీఓను అడుగుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. మండలంలోని కిమ్మి గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్ ఆయన పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అర్హులైన వారందరికీ పింఛన్లు వచ్చేలా చూడాలన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఆర్‌ఎస్‌కేలలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అంతకుముందు కంబరవలస గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఈఓ బి.కోటేశ్వరరావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్లు లేకుండా చూడాలి

- ఆర్‌జేడీ విజయభాస్కర్



పేరెంట్ అండ్ టీచర్స్ సమావేశానికి ఆర్‌జేడీకి ఆహ్వానం ఇస్తున్న విద్యార్థినులు

సీతంపేట: విద్యార్థుల్లో డ్రాపౌట్లు లేకుండా చూడాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) విజయభాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక కేజీబీవీ, ఎంఆర్‌సీని సందర్శించారు. కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడి, వారి సామర్థ్యాలను అంచనా వేశారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారం వంటివి అందాయా, లేదా అని అడిగితెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఎంఆర్‌సీని సందర్శించి, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.ఆనందరావు, సూర్యచంద్ర, కేజీబీవీ ప్రిన్సిపాల్ సీహెచ్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ పరిశీలన



బీజేపురం బాలికల వసతిగృహంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురం పంచాయతీలోని బాలికల వసతిగృహం పరిశీలనతో పాటు గ్రామంలో పారిశుధ్య పనులను ఎంపీడీవో ధర్మారావు బుధవారం పరిశీలించారు. డ్రైన్‌పై నిర్మాణాలు చేపడుతున్నందు వల్ల చెత్తను తీసేటప్పుడు ఇబ్బందిగా ఉంటుందని దాని వలన ఈగలు, దోమలు తాండవించే ప్రమాదం ఉందని అన్నారు. ప్రజలు చెత్తను తీసే వారికి సహకరించాలని కోరారు. బాలికల వసతిగృహాన్ని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వరి, మొక్కజొన్న పంటలకు బీమా తప్పనిసరి

కొమరాడ: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి, మొక్కజొన్న పంటలు వేస్తున్నా రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన్ పథకం ద్వారా తప్పనిసరిగా బీమా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శిక్షణ సమన్వయ కర్త ఆర్.శ్రీసివాసరావు అన్నారు. బుధవారం పోలం పిలుస్తోంది కార్యక్రమం మండలంలో గంగారేగువలసలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఎకరానికి రూ.800, మొక్కజొన్నకు ఎకరానికి రూ.330 చెల్లించాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలోకి రావలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శారద, కురుపాం సహాయ సంచాలకులు ఆర్.అన్నపూర్ణ, మండల వ్యవసాయ అధికారి సిహెచ్.ప్రసాద్‌రావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

భామిని: మండలంలోని బాలేరు పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్ఓ కె. విజయపార్వతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులకు అందిస్తున్న సేవలపై వైద్యాధికారి శివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే గర్భిణులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రజలకు మరింత మెరుగైన సేవలు



108లో రికార్డులు పరిశీలిస్తున్న ఆరోగ్యశ్రీ అధికారి

పాలకొండ రూరల్: 108, 104 ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆరోగ్యశ్రీ డిప్యూటీ ఈఓ డి.నరేందర్ అన్నారు. బుధవారం స్థానిక పాలకొండ ఏరియా ఆస్పత్రి వద్ద ఆయా వాహనాలను పరిశీలించారు. ప్రభుత్వం మారడంతో ఈ బాధ్యతను భవ్య సంస్థకు అప్పగించిన క్రమంలో వాహనా తాజా స్థితిగతులను స్వయంగా పర్యవేక్షించారు. వాహనాల్లో ఉన్న పరికరాలు, మందులు, రికార్డులను సరిపోల్చారు. ప్రస్తుత సీజన్‌లో పిల్లలకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశీలనలలో 108 రీజనల్ మేనేజర్ మన్మథనాయుడు, గిరిబాబు, జి.గణపతి, రమణ తదితరులున్నారు.

కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి



మానవహారంగా ఏర్పడిన కార్మికులు

సీతంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీతంపేటలో కార్మికులు బుధవారం భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, శానిటేషన్ వర్కర్లు, వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరావు, కాంతారావు, శ్రీరాములు, సాంబయ్య, పార్వతి, అంజిలి, అరుణ, రొయ్య భారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ఓటర్ల నమోదు..



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కామేశ్వరరావు

వీరఘట్టం: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల పరిధిలో తరచూ ఓటర్ల నమోదు కార్యక్రమాలు నిర్వహించి, ఓటుహక్కుపై పౌరులకు అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్ల నమోదు చేసేవారమని.. ఇప్పుడు నిరంతరం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో కూడా 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా దరఖాస్తు చేసుకునే వీలు కల్పిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కవిత, నియోజకవర్గ ఎన్నికల డీటీ శేఖర్, సర్వే డీటీ జి.ప్రసాదరావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నేడు జిల్లా వినియోగదారుల సదస్సు

వీరఘట్టం: విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు గురువారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ విష్ణుమూర్తి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేసేందుకు గాను ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలను తెలియజేయాలని కోరారు. ఆయనతో పాటు స్థానిక ఏఈ కె.అనిల్‌కుమార్ ఉన్నారు.

గర్జించిన కార్మిక లోకం

దేశ వ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం సార్వత్రిక సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా అన్నివర్గాల కార్మికులు భారీ ర్యాలీలు, మానవహారాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమాల్లో సీఐటీయూ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, గ్రీన్ అంబాసిదర్లు, వీఆర్‌ఏలు, వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పాలకొండ రూరల్: ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాలు



గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



కొమరాడ: ప్రజా సంఘాల ర్యాలీ